క్లుప్తంగా

గ్రంథాలయం అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): సాయిబాబానగర్‌లోని శ్రీ భగత్ సింగ్ గ్రంథాలయ అభివృద్ధికి రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ కందుకూరి శ్రీరామ్మూర్తి, అధ్యక్షుడు వివేకానంద రెడ్డి ఆధ్వర్యంలో రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు రాధిక, మామిడి మధుసూదన్, మోహన్‌రెడ్డి, మల్లేశ్వరి, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, పుల్లారెడ్డి, సురేంద్ర, సుధామోహన్, ప్రసాదరెడ్డి, లక్ష్మీనారాయణ, గ్రంథాలయ నిర్వాహకుడు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మూల పెద్దమ్మ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రులు కావడంతో ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అనంతరం భక్తులకు ప్రవేశం కల్పించి పెద్దమ్మ దర్శనం కల్పించారు. మొక్కులు చెల్లించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ 118వ జయంతిని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు మురళీధర్ మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయ సాధన కోసం యువతీ యువకులు, విద్యార్థి సంఘాల నాయకులు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, శ్రీనివాసులు, పట్టణ నాయకులు సాయి, మనోజ్, వెంకట్, రాఘవేంద్ర, సలీంబాషా, ధనుంజయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



చిన్మయి శ్రేయను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఫెన్సింగ్ పోటీల్లో పబ్బతి చిన్మయి అత్యున్నత శిఖరాలు అధిరోహించాలని శ్రీవాసవీ యువసేన సేవా సమితి నాయకులు శ్రీకాంత్, సునీల్‌కుమార్, వంకధార శబరి అన్నారు. ఆదివారం ఫెన్సింగ్ పోటీల్లో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి రాయలసీమలోనే మొట్టమొదటి ఫెన్సింగ్ క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్న పబ్బతి చిన్మయి శ్రేయను ఘనంగా సన్మానించారు.

3న భారత్ బంద్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా అక్టోబర్ 3వ తేదీ నిర్వహించనున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని జేఏసీ అధ్యక్షుడు బీరువాల బాషా కోరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ బంద్‌ను ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో నంద్యాల ముస్లిం జేఏసీ నాయకుడు మౌలానా అబ్దుల్, రజకసంఘం నాయకుడు రమణ, మాలమహానాడు జిల్లా సెక్రటరీ చక్రవర్తి వెంకట్, నరసయ్, వెంకటసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నందికొట్కూరు: పట్టణంలోని మిడుతూరు రోడ్డు వైపు ఈనెల 10వ తేదీ పంట పొలాలలో గడ్డి మందు తాగి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓర్వకల్లు మండలం, నన్నూర్ గ్రామానికి చెందిన షేక్ ఖాజాబాషా(30) కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు టౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. భార్య పుట్టింటికి చెప్పకుండా వెళ్లిందని గొడవ పడి ఎవరికి చెప్పకుండా బయటికి వచ్చాడని తల్లి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఊరూరా దసరా శోభ

నంద్యాల(వ్యవసాయం): దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఏడో రోజైన ఆదివారం పలు దేవాలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని శ్రీకాళికాంబాదేవాలయంలో అమ్మవారు విజయదుర్గాదేవి, బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో విశాలాక్షిదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీమూకాంబికాదేవి, సంజీవనగర్ రామాలయంలో శ్రీకాత్యాయినిదేవి, బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో గంగా, కామేశ్వరిదేవిలు లక్ష్మీదేవి, కాత్యాయినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బొమ్మలసత్రం శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో, మల్లికార్జునస్వామి దేవాలయంలో, బైర్మల్‌వీధిలోని ఆంధ్రాబ్యాంక్ వద్ద దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగజ్జననీ దేవాలయంలో పెద్ద ఎత్తున రాహుః కాల పూజలతో పాటు కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరించారు.ఆర్యవైశ్యం సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కొలువు దీర్చగా స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వచ్చి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

ఉయ్యాలవాడ : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఇంజేడు గ్రామంలో చౌడేశ్వరి మాత మహాచండీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో శ్రీమత్కన్యకాపరమేశ్వరిదేవిని ఆదివారం రాత్రి శ్రీభవానిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని పల్లకీపై ఆలయంలో ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీశారదాదేవిగా అమ్మవారు

దొర్నిపాడు: దేవినవరాత్రుల్లో భాగంగా దొర్నిపాడులో ఆదివారం అమ్మవారు శ్రీశారదాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి , భోజన వసతి ఏర్పాటు చేశారు.



అహోబిలంలో ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శాస్త్రోక్తంగా నవరాత్రి ఉత్సవాలు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం నిత్య పూజల అనంతరం ఉత్సవ మూర్తులు శ్రీదేవి భూదేవి సహిత శ్రీ ప్రహ్లాద వరద స్వామిని దేవాలయం ఎదురుగా ఉన్న యాగశాలలో కొలువుంచి వేద పండితుల మంత్రోచ్చారణలతో నవకలశ స్థాపన గావించి పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం తిరుమంజనం నిర్వహించి ఉత్సవ మూర్తులను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి శ్రీ అమృతవల్లీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి నవరాత్రి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రధాన అర్చకులు కీడాంబీ వేణుగోపాలన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.



ముత్యాలపాడు గ్రామంలో శ్రీభవానీదేవి అలంకరణలో అమ్మవారు



దొర్నిపాడులో భక్తులకు అమ్మవారి ప్రసాదం అందిస్తున్న దృశ్యం



శ్రీవిజయదుర్గాదేవి అలంకారంలో శ్రీకాళికాంబాదేవి



సంజీవనగర్‌రామాలయంలో కాత్యాయినిదేవిగా



ఇంజేడులో మహాచండీ దేవి అలంకారంలో అమ్మవారు



రుద్రవరంలో శాకాంబరీదేవి అలంకారంలో అమ్మవారు



ప్రత్యేక అలంకారంలో శ్రీ వాసవీమాత

సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి

దొర్నిపాడు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ గోపవరం అమర్‌నాథరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ సీజనల్ వ్యాధులు సోకకుండా మంచినీటి సరఫరాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియకు సూచించారు. అలాగే రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలని మండల వ్యవసాయాధికారి ప్రమీలకు ఎంపీపీ సూచించారు. వ్యవసాయశాఖ సమీక్ష రావడంతో కొండాపురం సర్పంచి మాధవీలత మాట్లాడుతూ ఎరువుల పంపిణీ విషయంలో కొండాపురం గ్రామంలో వ్యవసాయ సిబ్బందిపై జరిగిన దాడిలో అధికారులు ఎవ్వరూ చర్యలు తీసుకోక పోవడం విడ్డూరమన్నారు. కనీసం ఒక్క అధికారి కూడా ఖండించక పోవడం గమనార్హం అన్నారు. ప్రజాప్రతినిధులు రాజకీయాల్లో ఉండచ్చు పోవచ్చని అధికారులు మాత్రం ప్రజలకు సేవ చేయాలే గాని రాజకీయనాయకులకు వత్తాసు పలకడం ఎంతవరకు సబబు. ఇలా చేయడం వల్ల గ్రామాల్లో కక్షలు పెరిగే అవకాశం ఉందన్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు మురుగు కాల్వ నిర్మాణ విషయంలో కూడా రాజకీయం నడుస్తుంటే పల్లెలు ఎలా అభివృద్ధి చెందుతాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం ఎంఈఓ మనోహర్‌రెడ్డి, పశువైద్యాధికారి చిన్నబాబు, హౌసింగ్ ఏఈ బ్రహ్మయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ, వెలుగు ఏపీఎం బాబు వారి వద్ద ఉన్న సమాచారాన్ని సభలో పాఠంలా చదివి వినిపించారు. ఇక గ్రామాల్లో చీకటి పడితే చాలు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమల నివారణ కోసం తెచ్చిన ఫాగింగ్ యాంత్రాలను మూలన పడేశారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటిపై ప్రజా ప్రతినిధులు ఎవరూ నోరు మెదపకపోవడం గమనార్హం. కార్యక్రమంలో జెడ్పీటీసీ శకుంతలారెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ శివప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండాపురం సర్పంచి మాధవీలత, వేదికపై ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

రన్నింగ్ బస్సు నుంచి దూకిన మహిళ



పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆర్టీసీ బస్సు

దొర్నిపాడు: రన్నింగ్ బస్సు నుంచి దూకిన ఓ మహిళ కిందపడి గాయాలపాలైంది. ఆదివారం దొర్నిపాడులో ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్ల మండలం పెద్దవెంతర్ల గ్రామానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళ తన బంధువులతో కలిసి చాకరాజువేముల గ్రామానికి బయలు దేరారు. కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డ బస్సు ఎక్కిన ఆమె దొర్నిపాడులోని చాకరాజువేముల బస్టాండ్ వద్ద ముందుగా బంధువులు దిగారు. ఈమె వెనుక నుంచి దిగేందుకు ఆలస్యంగా రావడంతో ఎవ్వరూ లేరని డ్రైవర్ బస్సును కదిలించాడు. ఇంతలో కంగారు పడ్డ ఆమె బస్సులో నుంచి దూకేసింది. దీంతో కాలుకు తీవ్రగాయాలు కావడంతో ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. ఈ ఘటనపై దొర్నిపాడు పోలీసులు విచారణ చేస్తున్నారు.

అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థులు గ్రూప్ ఫొటో

శిరివెళ్ల: 35 ఏళ్ల కితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఇందుకు నాడు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలే వేదిక అయ్యింది. యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తర్వాత నాడు చదువు నేర్పిన గురువులు చిట్టెమ్మ, తిరుపతిరెడ్డి, వేమారెడ్డి, సరోజమ్మ, నరసింహులు, దత్తన్న, సాంబశివారెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం, వసంతమ్మలతో పాటు పాఠశాల స్థల దాతలు సత్తారు రామిరెడ్డి, గొటికె నరసింహారెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమార్, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబీకులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యవాది 'జాషువా'



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): విశ్వనరుడిగా తనను తాను ప్రకటించుకున్న విలక్షణ కవి గుర్రం జాషువా అని మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కేశవమూర్తి, వెంకటేశ్వర్లు అన్నారు. మిడ్ టౌన్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రోటరీ స్కూల్‌లో గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. సాహితీ వేత్తలు, క్లబ్ సభ్యులు జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయుడిగా స్టేట్ అవార్డు పొందిన అవ్వారు శేష పణి, మధురవాణి దంపతులను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ సభ్యులు అన్నెం శ్రీనివాసరెడ్డి, చిన్నపురెడ్డి, వెంకటేశ్వర్లు, రామసుబ్బయ్య, మాబూబాషరమేష్ , కాల్వ నాగరాజు, ప్రసాద్ , గోపి తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా పట్టణ నూతన కమిటీ ఎన్నిక



ఐద్వా నూతన కమిటీ ఎన్నుకున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఐద్వా పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి, నంద్యాల జిల్లా అధ్యక్షురాలు నిర్మల పేర్కొన్నారు. ఆదివారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. నంద్యాల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా సుజాత, హైమావతి, ఉపాధ్యక్షులుగా సునిత, శివమ్మ, సహాయ కార్యదర్శులుగా కృష్ణవేణి, ప్రసన్నలతో పాటు కోశాధికారిగా అరుణను ఎన్నుకొని 41 మంది మహిళా సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. మహిళా సమస్యలపై పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఒక్క మహిళకు అన్యాయం జరిగినా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రసాద్‌బాబు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు.

నేడు బలిజల నిరసన ర్యాలీ

ఆళ్లగడ్డ: శ్రీ కృష్ణ దేవరాయ వంశంగా ఉన్న బలిజల్లోకి దొమ్మెరులను 'గిరి బలిజలు'గా చేరుస్తూ కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 1793ను నిరసిస్తూ సోమవారం రుద్రవరంలో ర్యాలీ చేపట్టనున్నట్లు రుద్రవరం మండలం బలిజ సంఘం నాయకులు తెలిపారు. మండల కేంద్రం రుద్రవరం బలిజపేట నుంచి పెద్ద ఎత్తున ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకొని నిరసన తెలుపుతామన్నారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా బలిజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కౌన్సిల్ సమావేశం

బొమ్మలసత్రం: నంద్యాల మున్సిపాల్టీలోని కౌన్సిల్ హాల్‌లో సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శేషన్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చైర్ పర్సన్ మాబున్నీసా ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందన్నారు.

నంద్యాల కవులకు సత్కారం

నంద్యాల(వ్యవసాయం): మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ఇదారహె అదబ్ ఇస్లామియా తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ఉర్దూ కవి సమ్మేళనంలో నంద్యాల కవులకు సత్కారం లభించినట్లు కవులు అబ్దుల్‌సమ్మద్, మహమ్మద్ రఫీ, అజాద్‌ఖాన్, మహమ్మద్ జాఫర్ తెలిపారు. సమ్మేళనంలో తెలుగు రాష్ట్రాల నుంచి 60 మందికి పైగా కవులు పాల్గొన్నట్లు వెల్లడించారు.

ఉప్పొంగులో పడి వ్యక్తి మృతి

బండి ఆత్మకూరు : మండలంలోని ఈర్నపాడు గ్రామంలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి గోకారి (42) ఉప్పొంగులో పడి మృతి చెందాడని ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు.వివరాలు.. గోకారి బట్టలు ఉతకడానికి వాగులోకి వెళ్లి, ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

మహిళ మిస్సింగ్ కేసు ఛేదన

ఆత్మకూరు: బందోబస్తు విధులు నిర్వహిస్తూ మహిళ మిస్సింగ్ కేసును ఆత్మకూరు పోలీసులు ఆదివారం ఛేదించారు. వివరాలు.. ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొట్టాల చెరువు గ్రామంలో శాంతిబాయి కనిపించడం లేదని మొదటి భర్త కుమారుడు కాశీ విశ్వేశ్వరనాయక్ 2023 మే 16న ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు మహిళ ఆచూకీ దొరకలేదు. ప్రస్తుతం ఆత్మకూరు టౌన్ ఎస్ఐ నారాయణరెడ్డి తిరుమల బ్రహ్మోత్సవాల బందోబస్తులో ఉండగా తిరుమలలో గుర్తించి భర్త మూర్తికి అప్పగించారు. బందోబస్తు విధులు నిర్వహిస్తూనే మహిళను భర్తకు అప్పగించినందుకు నంద్యాల ఎస్పీ అభినందించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలంటెంపుల్: దసరా మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.ఆదివారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్య కళావేదికపై విజయవాడకు చెందిన గాయత్రీ నృత్య నికేతన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన, వి.కృష్ణకుమార్ భక్తి సంగీత విభావరి నిర్వహించారు.

అన్నప్రసాద పథకానికి విరాళం

మహానంది: క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ప్రసాద పథకానికి హైదరాబాద్ నగరానికి చెందిన అజయ్‌కుమార్, కుటుంబ సభ్యులు ఆదివారం రూ.51,001 విరాళం అందించినట్లు ఆలయ సూపరింటెండెంట్ ఎం.నీలకంఠేశ్వరరాజు తెలిపారు. ఈ మేరకు వారు యాగశాల వద్ద వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తదితరులను కలిసి విరాళం సొమ్ము అందించారు.

పాలనలో కూటమి సర్కారు విఫలం



అగ్నిప్రమాదంలో గాయపడిన నాగేశ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: సుపరిపాలన అందించడంలో కూటమి సర్కారు పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. చంద్రబాబు వైఫల్యాలను కూటమి ప్రజాప్రతినిధులే బయటపెడుతున్నారన్నారు. దీనిని కప్పిపుచ్చుకునేందుకు బాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. ఆదివారం చాగలమర్రి మండలంలో మాజీ ఎమ్మెల్యే పర్యటించారు. నెల రోజుల క్రితం అగ్ని ప్రమాదంలో గాయపడిన చక్రవర్తులపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగేశ్‌ను పరామర్శించారు. తర్వాత కదిరిపురం తండాలో పార్టీ నాయకుడు ఈశ్వర్‌నాయక్ ఇంట్లో నిర్వహించిన శుభ కార్యానికి హాజరయ్యారు. చాగలమర్రిలోని ఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ సీనియర్ నాయకుడు డీఈఎస్ షరీఫ్ కుమారుల రిసెప్షన్‌కు, స్థానిక కేజీఎన్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ నాయకుడు గేట్ల మహబూబ్ సాహెబ్ మనుమరాలి నిఖా కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో ఓ వైపు విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాక కాలేజీలు మూత పడే పరిస్థితి నెలకొంటే మరోవైపు మద్దతు ధర లేక ఉల్లి రైతులు ఆత్మహత్య చేసుకునే దుస్థితి నెలకొందని చెప్పారు. ఈ సమస్యలను చంద్రబాబు పట్టించుకోకుండా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై దృష్టి సారించారని మండిపడ్డారు. కూటమి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే బాలకృష్ణ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను గంగుల తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధానకార్యదర్శి షేక్ బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు, పార్టీ మండల అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, వ్యాపార వేత్తలు చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, సర్పంచ్ గోవిందయ్య, ఉప సర్పంచ్ షేక్.సోహెల్, షేక్. నాయబ్ రసూల్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి శేషు రమేష్, మాజీ జెడ్పీటీసీ రామగుర్విరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పత్తి నారాయణ, కె.లక్ష్మీరెడ్డి, ఎం.ఫయాజ్, పార్టీ ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, వార్డు మెంబర్లు ఆర్ఎస్ రమణ గుప్తా, ముల్లా బురాందీన్, వి.మహబూబ్ షరీఫ్, ఫ్రూట్ షేక్షావలి, విజయ డెయిరీ దస్తగిరి, చిన్న గురప్ప తదితరులు పాల్గొన్నారు.

దిగుబడికి కాలిబాటలు



పొలంలో కాలిబాటలు తీసిన వరిపైరు

- ఎరువులు, పురుగు మందుల పిచికారీకి అనుకూలం
- వరిలో కాలి బాటలతో చీడపీడలు దూరం
- రైతులు ఈ పద్ధతిని అనుసరించాలని వ్యవసాయాధికారులు సూచన

గోస్పాడు: నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో వరిని అధికంగా సాగు చేస్తారు. రెండుకార్లు ఈ పంటనే పండిస్తారు. ఈ పంట పొలాల్లో కాలిబాటల ఏర్పాటుతో ఎన్నో ప్రయోజలున్నాయి.అయితే, అదనపు ఖర్చులు, కాలిబాట మార్గంలో వరినాట్లు తొలగించడం వల్ల దిగుబడి తగ్గుతుందని చాలా మంది రైతులు కాలిబాట ఏర్పాటుకు దూరంగా ఉంటున్నారు. ఇదంతా అపోహనని కాలిబాటలు తెగుళ్ల నివారణతో పాటు దిగుబడి పెరుగుదలకు దోహదపడతాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

నాట్లు పూర్తయ్యాక..

వరినాట్లను పూర్తిగా వేసిన తర్వాత వరిమళ్లలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పున తూర్పు, పడమర దిక్కులో కాలిబాటలు వేయాలి. నాట్లు వేసిన 12 నుంచి 16 రోజుల్లో వీటిని తీయడం మంచిది. మందపాటి తాడును తీసుకొని వరి మళ్లల్లోని అవతలి గట్టుకు ఒకరు, ఇవతలి గట్టుకు ఇంకొకరు తాడును పట్టుకొని లాగాలి. ఆ తాడుకు 20 సెంటీ మీటర్ల దూరంలో సమాంతరంగా మరో తాడును ఇదే పద్ధతిలో ఏర్పాటు చేసుకొని రెండు తాళ్ల మధ్య ఉండే వరి మొక్కలను తీసి పలుచగా ఉన్న ప్రాంతాల్లో నాటుకొని కాలిబాటలు తీసుకోవాలి.

కాలిబాటలు తీసుకునే విధానం ఇలా..

వరినాట్లు వేసేటప్పుడు కాలిబాటలు వేయాలంటే ముందుగానే రెండు గట్ల మధ్య తాళ్లు లాగి ఆ ప్రదేశాన్ని వదిలేసి వరినాట్లను నాటుకోవాలి. విత్తనాలను పొలంలో వేసే పద్ధతిని పాటించిన రైతులు కూడా కాలిబాటలను తీసుకోవచ్చు. వరి పైరు ఎదుగుతున్న సమయంలో మొక్కలను తొలగించి పక్కనే నాటుకోవడం ద్వారా బాటలు తీయవచ్చు. ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల వెడల్పుతో మొక్కలను తొలగించాలి. దీంతో కాలిబాటలు ఏర్పడతాయి.

లాభాలు....

- కాలిబాటల ద్వారా మొక్కలకు గాలి, వెలుతురు బాగా అంది చీడ పీడలు రాకుండా ఉంటాయి.
- కిరణ జన్య సంయోగ క్రియ బాగా జరుగుతుంది. మొక్కలకు పత్ర హరితం అధికంగా ఉత్పత్తి అవుతుంది.
- పైరుకు ఎంత నీరు అవసరమో అంత మేరకే అందిస్తాయి. సాగు నేలలోని సేంద్రియ పదార్థాలు త్వరగా కుళ్లడానికి తోడ్పడుతాయి. మొక్కలకు పోషకాలను అందిస్తాయి.
- గాలి మొక్కలకు సమృద్ధిగా తగలడంతో పాటు కావలసినంత ఆక్సిజన్ పొందేందుకు వీలుంటుంది.
- పురుగు నివారణ మందులు సులభంగా పిచికారీ చేసుకోవచ్చు. ప్రతి మొక్కపైన మందు సులభంగా పడేందుకు వీలు ఉంటుంది.
- కలుపుల నివారణకు, మందుల పిచికారీకి, ఎరువులను సులభంగా చల్లుకునేందుకు, సమాన స్థాయిలో వేసేందుకు చాలా అనుకూలంగా ఉంటుంది.
- వరిమడిలో భూమి తడి లేకుండా సులభంగా ఆరబెట్టేందుకు వీలవుతుంది.
- రైతులు పైరులో ఉండే లోపాలను, ఎదుగుదలను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది.
- పైరు ఆరోగ్యవంతంగా పెరగడంతో పాటు అధిక దిగుబడులకు ఆస్కారం ఉంటుంది.

– వరికోత సమయంలో సులభంగా కోతలు కోసుకోవచ్చు.